క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం

పోరుమామిళ్ల : మండలంలో ఇటీవల బదిలీపై వెళ్లిన బాలఅంకిరెడ్డి, ఉపాధ్యాయులు పుల్లయ్య, సదాలక్ష్మిదేవి, వేణుగోపాల్‌లను తోటి ఉపాధ్యాయులు రామేశ్వరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, జయరాములు, వెంకట్రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, గురయ్య, శరత్, రాంప్రసాద్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాల సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : తవ్వారిపల్లె మాజీ వీఆర్‌ఓ బాల సుబ్బారెడ్డి అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తవ్వారిపల్లె గ్రామానికి మంగళవారం వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీపీ రాఘవరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ జోన్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, తవ్వారిపల్లె నాయకుడు అమరేశ్వర్‌రెడ్డి, డీఎల్ శ్రీనివాసులరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, తవ్వా వెంకటయ్య, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి




నివాళులర్పిస్తున్న ఆదిత్యారెడ్డి, తదితరులు

పోరుమామిళ్ల : మండలంలోని చెన్నారెడ్డిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి కుమారుడు రవీంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం తెలిసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి మంగళవారం మృతుడి ఇంటికి వెళ్లి రవీంద్రారెడ్డి భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, రాళ్లపల్లె నరసింహులు, రవిచంద్రారెడ్డి, సాయి నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

బి.మఠంలో బస్‌షెల్టర్ నిర్మించాలి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో స్థానికులు, యాత్రికుల కోసం తక్షణం బస్ షెల్టర్ నిర్మించాలని సీపీఐ మండల శాఖ నాయకులు ప్రభాకర్, రవి, నారాయణ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బస్‌షెల్టర్ లేక గత కొన్ని కొంతకాలంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ స్పందించలేదన్నారు. బి.మఠం నాల్గురోడ్ల కూడలి సాగర్ రోడ్డులో ఉన్న ఆర్అండ్‌బీ స్థలంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా ప్రత్యేక శ్రద్ధ చూపి భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలని సీపీఐ నాయకులు కోరారు.

5న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : ఈ నెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, పోలీసులు కలిసి విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వైజె.పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కక్షిదారుల్లో అవగాహన పెంపొందించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అన్నారు. కక్షిదారులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కేసుల్లో రాజీ పడి ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

వేంపల్లె : స్థానిక బంగారు దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గాంధీ రోడ్డులోని కొన్ని బంగారు దుకాణాలను తనిఖీ చేయడంతో మిగిలిన బంగారు దుకాణాలు, వస్త్ర దుకాణాలు కూడా మూసివేశారు. పట్టణంలో మొత్తం 42 బంగారు దుకాణాలు ఉన్నాయి. దుకాణాల తనిఖీల్లో చాలా అవకతవకలు ఉన్నాయని తెలిసింది. బంగారానికి సంబంధించి సరైన బిల్లులు, తూకాలు లేవని తనిఖీల్లో తెలిసింది.

వైద్యులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి వైద్యుడు ప్రజలకు వృత్తి పరమైన సేవ చేయాలని కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్‌వర్మ తెలిపారు. పట్టణంలోని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమై వారికి ఈసీజీ, టుడీ ఏకో, షుగర్ పరీక్షలు చేశారు. అలాగే అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్లు చేస్తామని హాస్పిటల్ జనరల్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. వైద్యులు నాగశేఖర్‌రెడ్డి, హరీష్‌బాబులు వైద్య సేవలు అందించారు.

డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్లకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ 3160 డిస్ట్రిక్ గవర్నర్ సాధు గోపాల కృష్ణ, పినాకిని జోన్ అసిస్టెంట్ గవర్నర్ కేవీ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతూ సమాజానికి సేవ చేస్తున్న డాక్టర్లను, ఆర్థిక నియమాలను క్రమబద్ధీకరిస్తూ సమాజ శ్రేయస్సు కోసం ఆర్థిక విధానాలను అందిస్తున్న చార్టెడ్ అకౌంటెంట్లను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీ షేక్ బాబా, ట్రెజరర్ దొంతు బాలాజీ, క్లబ్ కార్యవర్గ సభ్యులు డాక్టర్లు జి.రాజారామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య, అక్షిత్, నాగార్జున, వి.నరసింహారెడ్డి, చాందిని బేగం, సుజాత, హరిత, రేష్మా, చార్టెడ్ అకౌంటెంట్లు సాధు గోపాలకృష్ణ, నాగేళ్ల కృష్ణమూర్తిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్లు గుర్రం రామకృష్ణ, మురుకూటి సూర్యనారాయణరెడ్డి, తిరుమల బాల సూర్యారావు, పెంచలయ్య, మాజీ కార్యదర్శి శ్రీధర్ శర్మ, జాయింట్ సెక్రటరీ ఖాదర్ బాషా, సార్జెంట్ అటామ్స్ మహబూబ్‌బాషా, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఉట్టి తిరుపతయ్య, జమ్మలమడుగు రోటరీ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సభ, రీటైల్ వస్త్ర వ్యాపారుల కార్యవర్గ సభ్యుడు డీకే సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ వైవీ రామమునిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు : ప్రముఖ నేత్ర వైద్యుడు రామమునిరెడ్డి 88వ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన వైద్యశాలలో స్వరూప్ ఫార్మసీ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి మురళీనాథరెడ్డి, బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రామమునిరెడ్డి జీవితం భావి తరాలకు ఆదర్శమన్నారు. 88వ పుట్టిన రోజు జరుపుకొంటున్న ఆయన ఇప్పటికీ వైద్య వృత్తిని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వైవీ రామమునిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జంపాల రవీంద్రనాథ్ రెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గుండ్రా వెంకటసుబ్బారెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, జంపాల వేణుగోపాల్ రెడ్డి, జంపాల ఎర్ర సుబ్బారెడ్డి, దరిసా సత్యనారాయణ, పాలూరు వెంకటసుబ్బారెడ్డి, పాతకోట నరసింహారెడ్డి, చెన్నయ్య, ఆనంద్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్లను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



డాక్టర్ వైవీ రామమునిరెడ్డిని సన్మానిస్తున్న స్వరూప్ ఫార్మసీ మిత్ర బృందం

బ్రాహ్మణపల్లెలో పొలం పిలుస్తోంది



బ్రాహ్మణపల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె, అడుసువారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు ఏఓ విజయరావు అవగాహన కల్పించారు. డ్రోన్ టెక్నాలజీపై రైతులతో చర్చించారు. సిబ్బంది ఓబయ్య, విజయ్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



ఈదుళ్లపల్లె పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు

పోరుమామిళ్ల : చిత్తా శైలిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎఫ్‌సీఎస్ సహకారంతో మండలంలోని గిరినగర్, సుందరయ్యకాలనీ, నర్సింగ్‌పల్లె, పోరుమామిళ్ల మెయిన్, ఈదుళ్లపల్లె, ఇందిరానగర్, గురప్పగారిపల్లె, మహబూబ్‌నగర్, ఆదిఆంధ్రపాలెం, వాసుదేవాపురం, రామాయపల్లె, రామేశ్వరం, వెంకటాపురం గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 973 మంది విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎఫ్‌సీయస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు అందచేసిన 2920 నోటు పుస్తకాలను సంస్థ ప్రతినిధి ప్రసాదరెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఆ యా పాఠశాలల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియచేశారు.

5న మండల సమావేశం

మైదుకూరు : ఈనెల 5న మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించే సమావేశంలో మండల పరిషత్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు బి.మఠంకు కలెక్టర్, ఎమ్మెల్యే రాక

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తొట్లపల్లె వద్ద నూతనంగా నిర్మించిన మహా గురుకులం విద్యాలయం పరిశీలిన కోసం బుధవారం ఉదయం 10గంటలకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌లు వస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా మహాగురుకుల పాఠశాల ప్రారంభం, పరిశీలన, అనంతరం బి.మఠంలో త్వరలో జరగనున్న అభివృద్ధి పనులకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయలో ఇంటర్మీడియేట్ వరకు దాదాపు 850 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇప్పటికి ఆరు బస్సులు నడుపుతున్నారని, అదనంగా మరో రెండు బస్సులు నడపాలని కేవీకే పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర కోరారు. ఈ మేరకు ఆయన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఈ విషయంగా విన్నవించామని తెలిపారు. కేవీకే పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చంద్రగిరి నారాయణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీవీ పట్టాభిరామ్ మృతి తీరనిలోటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకియాట్రిస్ట్ బీవీ పట్టాభిరామ్ మరణించారన్న వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు డాక్టర్ జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎందరో యువకులను సన్మార్గంలోకి మళ్లించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమన్నారు. గతంలో పలు సందర్భాలలో కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని వారు సందర్శించి, తాను రచించిన పలు పుస్తకాలను అందజేశారన్నారు. తెలుగువారు ఒక గొప్ప వ్యక్తిత్వ నిపుణుడిని, రచయితను కోల్పోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారికుటుంబ సభ్యులకు భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నామన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: హైదరాబాద్ సమీపంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ యూనిట్లో జరిగిన భారీ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఎస్.డి విజయ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని, ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లింపులతో పాటు బాధ్యత వహించాల్సిందిగా డిమాండ్ చేశారు.

వక్ఫ్ స్థలాల ఆక్రమణ అరికట్టాలి

కడప రూరల్: వక్ఫ్ స్థలాలను ఆక్రమిస్తున్నారని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని పలు ప్రాంతాల్లో విలువైన వక్ఫ్ స్థలాలు ఆక్రమణకు గురి అవుతున్నాయని ఆరోపించారు. స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని ఉరి తాళ్లతో నిరసన



ఏడురోడ్ల కూడలిలో ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ / కడప సెవెన్ రోడ్స్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడురోడ్ల కూడలిలో ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి మాట్లాడుతూ జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు రూ.24500 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దాదాపు 13000 వేల మంది వున్నారని, స్ట్రీట్ లైటింగ్, వాటర్ వర్క్స్, హార్టీకల్చర్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారని, కొందరు డ్రైవర్లుగా సేవలందిస్తున్నారన్నారు. యోగా పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్న కూటమి ప్రభుత్వం, కార్మికుల వేతనాలు పెంచడానికి మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. విశాఖపట్నంలో ప్రైవేటు సంస్థలకు భూములు అప్పగించడానికి అత్యవసరంగా సమావేశమయ్యే మంత్రివర్గం, కార్మికుల సమస్యలను మాత్రం చర్చించడం లేదన్నారు. ఆప్కాస్‌లో గవర్నమెంట్ ఉద్యోగి అని తొలగించి, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, సహాయ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, సుబ్బారాయుడు, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ఆందోళనలో నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు రూ.12వేల వేతనంతో తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ని ధర్నాలు చేసినా, వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం గానీ ఇతర సంక్షేమ పథకాలుగానీ వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. ఆప్కాస్ ఆన్‌లైన్‌లో కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా చూపుతూ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి ఎస్. కిరణ్, వి. శ్రీధర్, నాగరాజు, సాయి, హరికృష్ణ, హజరత్, కొండయ్య, కాటమయ్య, శివ, ఆదాము, సాయమ్మ, పెంచలమ్మ, రమణ పాల్గొన్నారు.

పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన



భూముల కేటాయింపుపై చర్చిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు : పవన విద్యుత్ టవర్ల (గాలిమరలు) ఏర్పాటుకు అవసరమైన భూములను ఆర్డీవో సాయిశ్రీ మంగళవారం పరిశీలించారు. తహసీల్దారు అలీఖాన్, డిప్యూటీ తహసీల్దారు వరద కిషోర్‌రెడ్డిలతో కలసి ఆమె మండలంలోని బొందలకుంట, యామవరం, చింతకుంట గ్రామాలకు చెందిన భూములను పరిశీలించారు. యామవరం సమీపంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూములను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, విద్యార్థుల భోజనశాల, నిర్మాణంలో వున్న పాఠశాల అదనపు గదులను ఆమె పరిశీలించి విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీసద్గురు సమర్థనారాయణ స్వామి మహరాజు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఉన్న శ్రీసద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో మంగళవారం 35వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, కలశస్థాపన చేసి భక్తులందరికి మహా సంకల్పం చేయించారు. అనంతరం శ్రీప్రతాపమారుతి స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. చండీ పారాయణం, జప పారాయణం, అర్చనలు, అగ్నిప్రతిష్ఠ, వివిధ అభిషేకాలు నిర్వహించి మహా నివేదన, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు గోపాలస్వామి భక్తులను ఆశీర్వదించారు.

50 శాతం సబ్సిడీతో జింక్ సల్ఫేట్, జిప్సం



రైతులతో అధికారులు, శాస్త్రవేత్తలు

మైదుకూరు : రైతులకు 50 శాతం సబ్సిడీతో జింక్ సల్ఫేట్, జిప్సం అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆదిరెడ్డిపల్లె, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ఏసిన తర్వాత రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి, రైతు సేవా కేంద్రం అందించే సేవల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.బాలకృష్ణ, డాక్టర్ కాంతిశ్రీ అరటి, పసుపు పంటల్లో వచ్చే చీడపీడల గురించి, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం అరటి, బొప్పాయి తదితర పంటలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

పోరుమామిళ్ల : మండలంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు జూలై 4వ తేదీ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామ్యూల్ డేవిడ్‌రాజు తెలిపారు.

విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, అర్థమెటిక్స్, జనరల్ స్టడీస్, కంప్యూటర్ ఫండమెంటల్స్‌పై ఈ శిక్షణ రోజూ ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు ఉంటుందన్నారు. కంప్యూటర్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్‌తో పాటు ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ లాబ్స్ ద్వారా ప్రయోగాల నిర్వహణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నేర్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్, ఇంటర్ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9701012411 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

రాజుపాళెం : ప్రస్తుతం వ్యవసాయ రంగంలో పెట్టుబడులు అధికంగా అవుతున్నాయని రైతులంతా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పగిడాల, గోపాయపల్లె గ్రామంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలను రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను పట్టి తరలించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టి తరలించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వివి.నరసింహారెడ్డిని మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రతి రోజూ ఎక్కడో చోట వృద్ధులు, మహిళలు, చిన్నారులు కుక్క కాటుకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా వీధి కుక్కలకు టీకా వేయించి ఊరి చివరకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు మస్తాన్‌షరీఫ్, ఓబుల్‌రెడ్డి, యువరాజ్, నాగార్జున, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడప రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రోగి నుంచి తొలగించిన కణితి (ట్యూమర్)



ఆపరేషన్ చేయించుకున్న రోగి రామాంజనేయులును పలుకరిస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: కడపలోని రిమ్స్ ఆవరణంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. వేముల మండలం తుమ్మలపల్లికి చెందిన రామాంజనేయులు(37)కు ఇటీవల అరుదైన, హార్మోన్ స్రవించే గ్రంధి వ్యాధి అయిన ఫియోక్రోమోసైటోమా వ్యాధిని గుర్తించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధి సగటున ప్రతి 10 లక్షల మందిలో ఐదుగురిలో మాత్రమే కనిపిస్తుందని డాక్టర్ల బృందం తెలియజేశారు. వైద్య పరీక్షల ద్వారా అతని కుడి వైపు అడ్రినల్ గ్రంథిలో (కుడి మూత్ర పిండం పైభాగాన) సుమారు 10-12 సెం.మీ పరిమాణంలో ట్యూమర్ (కణతి) ఉన్నట్టు నిర్ధారణ అయింది. శస్త్ర చికిత్సకు ముందు ఎండోక్రైనాలజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మనోజ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో రోగి బీపీ పూర్తిగా నియంత్రించి.. ఆ తర్వాత అనుభవజ్ఞులైన యూరాలజీ కు చెందిన డాక్టర్ రాజా రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్), డాక్టర్ శ్రీదీప్ సిద్ధవరం (అసిస్టెంట్ ప్రొఫెసర్) నేతత్వంలో అనస్తీషియా విభాగానికి చెందిన ప్రొఫెసర్, విభాగాధిపతి డా. సునీల్ చిరువెళ్ల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్ సమన్వయంతో ఓపెన్ అడ్రినలెక్టమీ విజయవంతంగా నిర్వహించారు.

ఎల్ఐసీ సంరక్షణకు రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వరంగంలోని ఎల్ఐసీని సంరక్షించుకోవడానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఎల్ఐసీ యూనియన్ కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. ఆ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం యూనియన్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ మోసకారి ప్రైవేటు బీమా సంస్థలకు వ్యతిరేకంగా తమ సంఘం 1951 నుంచి ఐదేళ్లపాటు పోరాడిందన్నారు. ఆ తర్వాతే జాతీయకరణ జరిగి ఎల్ఐసీ ఏర్పాటైందని గుర్తు చేశారు. తాము ఎల్ఐసీని, తమ సంఘాన్ని రెండు కళ్లుగా భావిస్తామన్నారు. ఖాతాదారులకు కార్యాలయంలో బాధ్యతతో సేవలు అందిస్తామన్నారు. బయట పౌరులతో కలిసి సంస్థను కాపాడుకునేందుకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలని కోరారు. ఎల్ఐసీ పొదుపు మొత్తాలకు పాలసీదారులకు ప్రత్యేక ఆదాయ పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ ఆలోచన, బీమా చట్టాల సవరణ బిల్లు ఆలోచనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 9వ తేది దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన సీనియర్లు, కడప డివిజన్ వ్యవస్థాపక నాయకులు ఖాదర్‌బాష, శంకర్‌రావు, చంద్రశేఖర్ రెడ్డి, ఏఆర్ఎస్ బాబు, గంగయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధీకర్, అక్బర్‌బాష, వసుప్రద, అయ్యవారురెడ్డి, వారిజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రైల్వే చార్జీలను ఉపసంహరించుకోవాలి



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం రైల్వే చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ మాస్టర్‌కు పెంచిన చార్జీలను తగ్గించాలంటూ వినతిత్రపం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కిలోమీటరుకు పైసా పెంచడం వల్ల దూర ప్రాంతాలు వెళ్లేప్రయాణికులపై అదనపు భారం పడుతుందన్నారు. రైల్వేస్టేషన్‌లలో కనీస మౌలిక సదుపాయాలు లేకుండానే కేంద్రం చార్జీలను పెంచడం అన్యాయం అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంతో పాటు వచ్చిన ప్రయాణికులకు ఎక్కడ మరుగుదొడ్లు, తాగునీరు లేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా చార్జీలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు.